సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పిఎంశ్రీ పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటు

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పిఎంశ్రీ పాఠశాలల్లో నిర్దేశించిన 21 రకాల మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో విద్యాశాఖ ఇతర, శాఖల అధికారులతో కలెక్టర్ కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా ప్రోగ్రాం కింద ఫేజ్-1, 2లో 52 పాఠశాలలను గుర్తించామన్నారు. ఫేజ్ -1 కింద రూ.1.24 కోట్లతో 8 కెమిస్ట్రీ ల్యాబ్‌లు, 29 పాఠశాలల్లో రూ.1.45 కోట్లతో ప్లేఫీల్డ్‌లను అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. వీటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. 10వ తరగతిలో ప్రతి విద్యార్థి పాస్ అయ్యే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డిసెంబర్ లోపు సిలబస్ అంతా పూర్తి చేసి, జనవరి నుండి పరీక్ష లను దృష్టిలో పెట్టుకొని, ఆ దిశగా ముఖ్యమైన ప్రశ్నలు, సమాధానాలను విద్యార్థులకు నేర్పించే విధంగా చర్యకు తీసుకోవాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థుల కోసం త్వరలో సెంట్రల్ బేస్డ్ వర్చువల్ తరగతుల బోధనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, ఆర్‌డిఒలు సందీప్ కుమార్, భరత్ నాయక్, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అ కొ ందరికా..?

- వినియోగదారుల్లో పలు సందేహాలు
- దీపావళి నుంచి ఉచిత గ్యాస్‌కు సన్నాహాలు
- మంత్రివర్గ సమావేశంలో తేల్చే అవకాశం

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. దీపావళి నుంచి ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఇప్పటికే వెల్లడించారు. ఈ పథకం విధివిధానాలు, అర్హతలు ప్రభుత్వం ఇంకా ఖరారు చేయకపోవడంతో ఈ పథకం ఎవరికి వర్తిస్తుం దోనని వినియోగ దారుల్లో పలు సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. బుధవారం నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పాటు విధి విధానాలను ఖరారు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరుతో పలు హామీలను ఇచ్చింది. ఎన్నికల్లోకి వచ్చిన తరువాత పింఛన్ల పెంపునకు శ్రీకారం చుట్టింది. ఆ తరువాత మిగతా హామీలను అమలు చేసేందుకు సాహసం చేయలేదు. దీంతో ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో సూపర్ సిక్స్‌లో ఒక హామీ అయిన ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ దీపావళి (అక్టోబర్ 31) నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. అయితే ఈ పథకానికి సంబం ధించిన విధివిధానాలను ఇంకా ఖరారు చేయలేదు. దీంతో అసలు ఈ పథకం ఎవరికి వర్తిస్తుంది? ఎవరికి వర్తించదు? తమకు ఉచిత గ్యాస్ సిలిండర్ వస్తుందా లేదా? అని వినియోగదారుల్లో సందేహాలు వ్యక్తమవు తున్నాయి. కర్నూలు జిల్లాలో 6.74 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 2.4 లక్షల దీపం కనెక్షన్లు కూడా ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 5.77 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 1.55 లక్షల దీపం కనెక్షన్లు, 33,732 పిఎం ఉజ్వల యోజన కనెక్షన్లు ఉన్నాయి. ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్ ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని వర్తింపజేస్తుందా? లేక కొందరికే వర్తింపజేస్తుందా? అనే సందేహం వినియోగదారుల్లో పెద్ద ఎత్తున వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం గృహ అవసరాలకు వినియోగించే 14.6 కిలోల గ్యాస్ సిలిండర్ రూ.856 ఉంది. ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం ప్రతి వినియోగ దారునికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ఏడాదికి కర్నూలు జిల్లాకు రూ.170 కోట్లు, నంద్యాల జిల్లాకు రూ.148 కోట్ల వరకూ అవసరం ఉంటుంది. ప్రభుత్వం పలు కొర్రీలు పెట్టి వీలైనంత తక్కువ మందికి ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేసేందుకు ముందుకు వెళ్లే యోచనలో ఉందని ఇప్పటికే ప్రజల్లో జోరుగా చర్చ సాగుతోంది.

మొదట కొంటే..ఖాతాలో డబ్బు..

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని డిబిటి విధానంలో అమలు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. తొలుత గ్యాస్ సిలిండర్‌ను మామూలుగా డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తే కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ఇస్తున్న రూ.25 రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలుదారుల ఖాతాలో జమ చేసేలా నిర్ణయించనున్నట్లు సమాచారం. మూడు ఉచిత సిలిండర్లు కూడా ఒక దాని తరువాత ఒకటి కాకుండా నాలుగు నెలలకాలానికి ఒక సిలిండర్ చొప్పున ఇవ్వనున్నారు. డిబిటి విధానంలో ఈ ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తే ప్రభుత్వం సిలిండర్ కొనుగోలు చేసిన మొత్తాన్ని ఖాతాల్లో జమచేయకపోతే ఎలా అని వినియోగదారుల నుంచి సందేహం వ్యక్తం అవుతోంది. ఈ పథకానికి సంబంధించి విధివిధానాలు వచ్చే వరకూ తాము ఎలాంటి చర్యలు తీసుకోలేమని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నారు. బుధవారం అమరావతిలో నిర్వహించే మంత్రివర్గ సమావేశంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి అనుమతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఆ పథకానికి సంబంధించిన విధివిధానాలను కూడా ఆ సమావేశంలోనే ఖరారు చేయనున్నట్లు సమాచారం.

అమీర్ హైదర్ ఖాన్ నగర్‌లో సిసి రోడ్లు వేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరంలోని అమీర్ హైదర్ ఖాన్‌నగర్‌లో శాసనసభ ఎన్నికలకు ముందు మురుగు కాలువలు నిర్మించి ఎర్రమట్టి రోడ్లు వేశారు. చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లన్నీ బురద మయం అయ్యే పరిస్థితి ఉందన్నారు. సిసి రోడ్లు వేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు సిపిఎం నగర కార్యదర్శి ఎం. రాజశేఖర్, నగర కమిటీ సభ్యులు మాబుస, కాలనీ వాసులు శివయ్య ఆచారి, నాగేంద్ర కలిసి వినతి పత్రం ఇచ్చారు. కాలనీలో డ్రైనేజీ నిర్మించినప్పటి నుండి ఇప్పటివరకు కాలువలు శుభ్రం చేసే వారే లేరన్నారు. తక్షణమే వర్కర్స్ ను ఏర్పాటు చేసి మురుగు కాలువలు శుభ్రం చేయించాలని కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా మహిళల సామూహిక మరుగుదొడ్లు కొత్తగా నిర్మించాలని వాటిని శుభ్రం చేయుటకు ఒక స్కావెంజర్‌ను నియమించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు తక్షణమే స్పందిస్తూ మీకు ఇంటికో మరుగుదొడ్డి మంజూరు చేస్తామని మాట ఇచ్చారు. అదేవిధంగా మురుగు కాలువలు కూడా శుభ్రం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఒకసారి అమీర్ హైదర్ ఖాన్ నగర్ ను సందర్శించి తక్షణమే సిసి రోడ్లు మంజూరు చేయాలని కోరగా నేను వచ్చి విజిట్ చేసి మీ సమస్య పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేధింపులకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మహిళలపై వేధింపులకు పాల్పడితే ఉపేక్షించే ప్రసక్తే లేదని అందుకు తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో మహిళలు పని చేసే చోట వారిపై జరిగే లైంగిక వేధింపులు, హింస, వివక్ష, వ్యతిరేకత నిర్మూలనపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెసి డాక్టర్ బి.నవ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి వెంకటలక్ష్మి, లైంగిక వేధింపులు కమిటీ ఛైర్మన్ డాక్టర్ మాధవి శ్యామల, న్యాయవాది నాగలక్ష్మి, జిల్లా స్థాయి మహిళా అధికారులు, దిశావన్ స్టాప్ పోలీస్ సిబ్బంది, ఐసిడిఎస్ సిబ్బంది, పొదుపు సంఘం మహిళలు పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ విశాఖ కేసు మార్గనిర్దేశాల ప్రకారం పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపుల నివారణకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. తోటి సిబ్బందిపై తప్పుడు ఆరోపణలు చేయకూడదని, తద్వారా నిజంగా జరిగిన అంశాలు బయటకు వచ్చే అవకాశం ఉండన్నారు. పాఠశాల, కళాశాలలో కూడా పిల్లలకు, విద్యార్థిని, విద్యార్థులకు పోష్ యాక్ట్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై కూడా వారికి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పని ప్రదేశాల్లో మహిళలపై జరిగే లైంగిక, హింస వేధింపుల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో లైంగిక వేధింపులు కమిటీ సభ్యులు, మహిళా ఉద్యోగులు, ఐసిడిఎస్ సిబ్బంది, పొదుపు సంఘాల మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

సైబర్ నేరానికి గురైతే 1930కి ఫోన్ చేయండి...

- గంట లోపే సమాచారం అందించండి
- యువతను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దండి
- ప్రిన్సిపల్స్, అధ్యాపకుల సమావేశంలో ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఎలాంటి సైబర్ నేరానికి గురైనా గంటలోపు 1930 డయల్ నెంబర్ కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ అన్నారు. మంగళవారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో కర్నూలులోని వివిధ ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు చేశారు. ఎమైనా సమస్యలు వచ్చినప్పుడు పోలీసులు ఎలా స్పందిస్తున్నారన్న విషయాల గురించి జిల్లా ఎస్‌పి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అనవసర లింకులు క్లిక్ చేయవద్దని, హానీట్రాప్, మీ అబ్బాయి కిడ్నాప్ అని, కొరియర్ వచ్చిందని , లాటరీ తగిలిందని, డిజిటల్ అరెస్టు పేరుతో వీడియో కాల్స్ చేస్తూ సైబర్ నేరగాళ్ళు పలు మోసాలకు పాల్పడుతున్నారని జాగ్రత్త గా ఉండేవిధంగా విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎస్‌పి సూచించారు. కళాశాలల వద్ద విద్యార్థులు సైలెన్స్ లేకుండా బైక్ లు నడపడం, ట్రాఫిక్ సమస్యలు, సిసి కెమెరాలు, కళాశాలల వద్ద పోలీసు గస్తీ వంటి విషయాల గురించి ఆయా కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు ఈ సమావేశంలో జిల్లా ఎస్‌పికి విన్నవించారు. ఈ సమస్యలపై ఎస్‌పి స్పందిస్తూ చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌పి మాట్లాడుతూ...యువత పాత్ర సమాజంలో చాలా ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. విద్యార్థులకు మనం ఏమి నేర్పితే వాళ్ళు అది నేర్చుకుంటారన్నారు. వారిభవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. వారిపై ఆధారపడ్డ తల్లితండ్రుల గురించి ఆలోచించే విధంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా చేయాలన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, మంచి నడవడిక పైనే వారి జీవితం ఆధారపడి ఉందన్నారు. యువతను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. మైనర్లు నిర్లక్ష్యంగా , అతివేగంగా బైక్ లు నడపడం, రోడ్డు ప్రమాదాలలో చనిపోవడం, డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా బైక్ నడపడం, ట్రిపుల్ రైడింగ్ చేయడం, బైక్ సైలెన్సర్లు లేకుండా అధిక శబ్దం చేస్తూ నడపడం చట్ట రీత్యా నేరమన్నారు. బైక్ సైలెన్సర్లు తీసి ఎక్కువ శబ్దం చేస్తూ బైక్ రైడింగ్ చేస్తున్న యువకుల వీడియోలు తీసి కర్నూలు జిల్లా పోలీసు వాట్సప్ నెంబర్ 7777877722 లేదా 9121101100 కు పంపించాలన్నారు. హానీట్రాప్, పోర్న్ సైట్లు చూస్తున్నారంటూ బెదిరించి, అరెస్టులు లేకుండా ఉండాలంటే ఫైన్ కట్టాలని , కొరియర్ పేరు చెప్పి కేసు పెట్టెస్తాం అని, లాటరీ తగిలిందని, పెట్టుబడులు పెట్టండి డబల్ చేస్తామని, అపరిచితుల నుండి వచ్చే వాట్సాప్ కాల్స్ చేస్తూ , వీడియో కాల్స్ చేస్తూ అమాయకులైన ప్రజలను సైబర్ నేర గాళ్ళు సైబర్ నేరాలకు గురిచేస్తున్నారన్నారు. జిల్లాలో చాలా మంది ప్రజలు సైబర్ నేరాలకు గురై రూ.కోట్లు నష్టపోయారన్నారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు, విద్యార్థులు, యువత పూర్తిగా అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరం బారిన పడితే వెంటనే ఒక గంట లోపే 1930 కి సమాచారం అందించాలన్నారు. సైబర్ క్రైమ్ పోర్టల్‌లో www.cybercrime.gov.in ఫిర్యాదు చేయాలన్నారు. స్పెషల్ బ్రాంచ్ సిఐ ప్రసాద్, డిసిఆర్‌బి సిఐ గుణశేఖర్ బాబు, కమాండ్ కంట్రోల్ సిఐ శివశంకర్, స్పెషల్ బ్రాంచ్ ఎస్‌ఐలు, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల, ఉస్మానియా కళాశాల, కెవిఆర్ కళాశాల, సెయింట్ జోసఫ్ కళాశాల, గవర్నమెంట్ జూనియర్ కళాశాల, కర్నూలు డిగ్రీ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, సాయిక్రిష్ణ డిగ్రీ కళాశాల, కోల్స్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి బిందు మాధవ్

-శరీన్‌నగర్‌లో మహానాకాబందీలో కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్

రౌడీ, గుండాయిజానికి పాల్పడితే చర్యలు

- కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్

-పోలీల మహా నాకాబందీ -శరీన్ నగర్ లో ఏకకాలంలో దాడులు

-అసాంఘి శక్తుల పై కర్నూలు పోలీసుల ఉక్కుపాదం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున కర్నూలు నాల్గవ పట్టణ సిఐ మధుసూదన్ గౌడ్ తన పరిధిలోని శరీన్ నగర్‌లో మహానాకబంది నిర్వహించారు. ఈ నాకబందిలో ఆరుగురు సిఐలు, ఆరుగురు ఎస్సైలు, 60 మంది పోలీసులు పాల్గొన్నారు. రౌడీషీటర్లు, అనుమానస్పద వ్యక్తుల ఇళ్ళల్లో దాడులు నిర్వహించారు. ఏడుగురు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేశారు. కర్నూలులోని శరీన్‌నగర్‌లో ఎలాంటి ధ్రువ పత్రాలు లేని 15 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ మాట్లాడుతూ... కర్నూలు పట్టణంలో రాత్రి , పగలు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎక్కడైనా ఎవరైనా దౌర్జన్యాలకు పాల్పడితే వదిలి పెట్టే ప్రసక్తే లేదన్నారు. కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు శరీన్‌నగర్‌లో కర్నూలు డిఎస్‌పి జె. బాబు ప్రసాద్ హెచ్చరించారు. సిఐలు మధుసూధన్ గౌడ్, పవన్ కుమార్, ప్రవీణ్ కుమార్, పార్థసారథి రెడ్డి, లక్ష్మయ్య, బాష, ఎస్‌ఐలు సమీర్‌బాష, చంద్రశేఖర్ రెడ్డి, మోహన్ కిశోర్ రెడ్డి , గోపినాథ్ , చంద్రశేఖర్ రెడ్డి , మన్మథ్ విజయ్, ఆర్ ఎస్‌ఐలు, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

పోలకల్ రీసర్వే గ్రామ సభకు స్పందన

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోనీ పోలకల్ గ్రామంలో తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి విఆర్‌ఒలు సోమశేఖర్ యాదవ్, తిమ్మయ్యల సమక్షంలో మంగళవారం రీ సర్వే గ్రామ సభను నిర్వహించారు. ఇక్కడే సుమారు 260 దరఖాస్తులు చేరుకొన్నాయని, భూమి కొలతల కోసం 97, జాయింట్ ఎల్‌బిఎం 93, ఎల్‌పిఎం మిస్సింగ్ మ్యాపింగ్ 15, ఆన్‌లైన్ కోసం 53, ఇతర సమస్యల దరఖాస్తులు 2 ఇలా అందుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రైతులు ఈ రీ సర్వే కార్యక్రమానికి భారీగా హాజరు కావడంతో స్పందన లభించినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ తహశీల్దార్ పురుషోత్తం, సర్వేయర్ నాగభూషణం, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం

అష్ఫాఖుల్లాఖాన్ జయంతిలో ఆవాజ్ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి ఎస్.ఎ.సుభాన్ ,ఆవాజ్ కమిటీ నగర అధ్యక్ష ,కార్యదర్శులు ,పి ఇక్బాల్ హుస్సేన్, ఎస్‌ఎండి. షరీఫ్ లు పిలుపు ఇచ్చారు. స్వాతంత్ర సమరయోధుడు, షహీద్ అష్ఫాఖుల్లా ఖాన్ 124వ జయంతి సభ ఆవాజ్ కమిటీ గౌరవ అధ్యక్షులు, ఎస్.ఇస్మాయిల్ అధ్యక్షతన మంగళవారం ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1900 అక్టోబర్ 22న జన్మించిన అష్ఫాఖుల్లా ఖాన్ స్వాతంత్ర సమరంలో 27 సంవత్సరాల కే ఉరి కంబాన్ని ముద్దాడాడన్నారు. బ్రిటీష్ సంకెళ్ల నుండి భారతదేశ విముక్తి కోసం ప్రాణాలు అర్పించిన యువ కిశోరంఅని కొనియాడారు. తన సహచరుడు రాంప్రసాద్ బిస్మిల్‌తో కలిసి చ్రావాచౌరి సంఘటనలో బ్రిటిష్ వారికి బంధి కావడంతో వారు ఉరి విధించారన్నారు. తను చనిపోయిన తర్వాత , నా శవానికి చుట్టే బట్టలో నా భరత మాత పిరికెడు మట్టి వేసి నన్ను పూడ్చాలని కోరిన మహా దేశభక్తుడు ఆష్ఫాక్ ఖుల్లాఖాన్ అని కొనియాడారు. నాకు మరో జన్మ గనక ఉంటే ఈ భారతదేశం లోనే పుట్టించాలని నా భరతమాత సుఖశాంతుల కోసం బానిసత్వం నుంచి విముక్తి కోసం ఎన్ని సార్లు అయినా ఉరికంబాన్ని ఎక్కుతా అని చెప్పిన ధీరుడు అష్ఫఖుల్లా ఖాన్ అని గర్వంగా వివరించారు. దేశాన్ని పరిపాలిస్తున్ననేటి పాలకులు మేమే దేశభక్తులమని గొప్పలు చెప్పుకుంటున్నారని, భాజపా వారి పాత్ర స్వాతంత్రపోరాటంలో లేదన్నారు. ఆవాజ్ నగర ఉపాధ్యక్షులు నాసిర్ అహ్మద్,ఖాజా పాషా, మహబూబ్‌బాషా, చోటుభాయ్, సహాయ కార్యదర్శులు నూర్‌వలి, షేక్‌షా, గౌస్‌బాష, ఫయాజుల్ కరీం, ఇలియాజ్, అబ్దుల్ రసూల్, ఇంతియాజ్, అహ్మద్‌బాయ్, నగర నాయకులు ఎండి హ నీఫ్, ఎస్.ఏ .గఫూర్ ,సోఫీ సా బేగ్, సయ్యద్ బాషా ,అస్లాం భాష తదితరులు పాల్గొన్నారు.

అష్ఫాఖుల్లాఖాన్ జయంతిలో మాట్లాడుతున్న సుభాన్

శ్రీరామకాలనీలో పర్యటించిన సిపిఎం నాయకులు సిహెచ్ సాయిబాబ, తదితరులు

దారిని తవ్వేశారు ..పూడ్చడం మరిచారు...

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కార్పొరేషన్ పరిధి 27వ వార్డు శ్రీరామకాలనీలో పెండింగులో ఉన్న రోడ్లను పూర్తి చేయాలని సిపిఎం నాయకులు సాయిబాబా డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం బృందం కాలనీలో పర్యటించిందని తెలిపారు. గత నెల రోజుల కిందట రోడ్లు కాలువల నిర్మాణానికి నాలుగు వీధులలో తవ్వి విడిచి పెట్టారన్నారు. గతనెల రోజులుగా కాలనీ ప్రజలు బయటికి రావడం లేదన్నారు. ఇంటి ముందు గొయ్యి దానిలో మొకాళ్ళ లోతు నీరు ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పురుషులు డ్యూటీలకు వెళ్లి రాత్రి పూట ఇళ్ల కు రావడానికి వాహనాలు ప్రక్కన ఉన్న కాలనీలో పెట్టి ఇంటికి రావలసిన పరిస్థితి ఏర్పడిందన్నారను. ఇళ్లలో నుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొందన్నారు. నెల రోజులుగా ఇంటి ముందు ఉన్న మురుగు నీటిలో కాపురాలు చెస్తున్నట్లుగా ఉందన్నారు. దసరా పండగ పూట కుటుంబాలతో బయటికి వెళ్లలేని స్థితిలో ఉన్నా మని స్థానికులు సిపిఎం బృందానికి తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా, 27వ వార్డు సిపిఎం కార్యదర్శి ఎం.లక్ష్మయ్య మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ కాలనీలో పర్యటించి సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు. సంబంధిత గుత్తేదారు చేసిన పనులకు బిల్లులు రాలేదని చెపుతున్నాడని ప్రజలు వాపోతున్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన తుగ్గలి నాగేంద్ర దంపతులు

ప్రజాశక్తి-తుగ్గలి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తుగ్గలి నాగేంద్ర దంపతులు... రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహ కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర. మాజీ జెడ్పిటిసి సభ్యురాలు కె.వరలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు.



సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-మద్దికేర

సమాచార హక్కు చట్టం పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. మండల కేంద్రమైన మద్దికేరలో వ్యవసాయ కార్యాలయం ముందు మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో వేరుశనగ రబీ లోపప్పు శనగ పంపిణీ, క్రాప్ బుకింగ్, సిసిఆర్‌పి వంటి వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వం నుండి వచ్చే ఫర్టిలైజర్, గన్ పంపులు, ఆయిల్ మోటార్స్ స్పిన్‌క్లర్ పైపులు, వంటి వివరాలను ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి పథకం వివరాలు చట్టం ద్వారా తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలు గమనించి ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎఇఒ భోజరాజు, ఫర్టిలైజర్ డీలర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ప్రజలు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం హమాలీ నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఎపిఎస్‌పిడిసిఎల్‌లో గత 35 సంవత్సరాలుగా బి. నాగరాజు హమాలి పని చేస్తూ అందరికీ ఆదర్శంగా ఉంటూ ఎలాంటి మచ్చ లేకుండా తన జీవితాన్ని గడిపాడని ఎడి గురు దివాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం తన పనికి విశ్రాంతి తీసుకుంటూ తన వారసున్ని పనిలో పెట్టాడని చెప్పారు. ఆయన సేవలను గుర్తించి ఆయనకు ఘనంగా తన తోటి సిబ్బంది సన్మానించారు. తోటి హమాలి చలపతి మాట్లాడుతూ ఇన్ని సంవత్సరాల కాలంలో ఎలాంటి చెడ్డ పేరు లేకుండాఎవరితో తగాదాలు లేకుండా కలిసిమెలిసి ఉంటూ జీవనం సాగించాడన్నారు. జాగ్రత్తగా పని చేస్తూ ఆనందంగా జీవితం గడిపాడన్నారు. అందరికీ పని ఇప్పించి అందరూ తన వారేనని భావించిన వ్యక్తి అన్నారు. మేమందరం నాగరాజును మరిచిపోకుండా ఆదర్శంగా ఉంటూకలిసిమెలిసి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ వినోద్ బాబు , ఎఇ మౌనిక , హమాలీలు కె. మోహన్ , చలపతి, సి.ఆంజనేయులు ,సురేష్ బాబు, రామిరెడ్డి, భీసన్న , విజయ్, సుధాకర్, పుల్లన్న, సుంకన్న, భీసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

బి.నాగరాజును సన్మానిస్తున్న అధికారులు, సహచర హమాలీ నాయకులు

పేదలకు పట్ట పాస్ పుస్తకాలివ్వాలి : వ్యకాసం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నిరుపేదలు సాగు చేసుకుంటున్న భూములకు వెంటనే పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి.నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఓర్వకల్ మండలం బొద్దిపల్లి రెవెన్యూ గ్రామ సభలో గ్రామస్తులతో కలిసి డిప్యూటీ తహశీల్దార్ షర్మిలారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. బి.నాగన్న, సంఘం మండల నాయకులు రామస్వామి, మాసుం00ంబాష, యువజన సంఘం నాయకులు మహేష్ పాల్గొన్నారు. బి.నాగన్న మాట్లాడుతూ దళితులు బిసిలు అట్టడుగున ఉన్న ప్రజలు 15 ఏళ్లుగా ప్రభుత్వ భూములను ముళ్ళ పొదలు తొలగించి బండరాళ్లను తొలగించి వేలకు వేలు ఖర్చుపెట్టి సాగు చేసుకున్నారన్నారు. అలాంటి పేదలకు పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. పట్టాలు ఇవ్వని పక్షంలో పేద రైతులం దరినీ కూడగట్టి ఆందోళన చేస్తామని హెచ్చ రించారు. ఒవెంకటేశ్వర్లు, రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

డిటికి వినతిపత్రం ఇస్తున్న నాగన్న, తదితరులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : బీవీ

- టిడిపిలో చేరిన వైసిపి కౌన్సిలర్లు, నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

టిడిపిలో చేరుతున్న వైసిపి కౌన్సిలర్లు, నాయకులు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. చంద్రబాబు పాలనకు ఆకర్షితులై వైసిపి కౌన్సిలర్లు టిడిపిలో చేరినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మిగనూరు మున్సిపల్ వైసిపి కౌన్సిలర్లు సరోజ, వహీద్, స్వాతి, వైసిపి సోషల్ మీడియా నాయకులు మన్సూర్ బాషా, జబీర్, వినయ్, మాజీ కౌన్సిలర్ వహబ్ ఎమ్మెల్యే బీవీ సమక్షంలో టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడారు. పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు కౌన్సిలర్లు టిడిపిలో చేరడం సంతోషకరమన్నారు. గత ఐదేళ్ల నుంచి టిడిపి కోసం కష్టపడిన నాయకులు, కార్యకర్తలు ఉన్నారని, వారికి పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు. పార్టీలో మోసం చేయాలని మోసపూరిత డ్రామాలాడిన వ్యక్తులు కూడా ఉన్నారని తెలిపారు. వైసిపిలో కౌన్సిలర్లు వారి వార్డుల్లో ఒక్క అభివృద్ధి పని కూడా చేసుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. కనీసం ఒక వ్యక్తికి సహాయం చేసిన పాపాన పోలేదన్నారు. టిడిపి కోసం కష్టపడిన కార్యకర్తలను తాను ఎప్పటికి మర్చిపోనని తెలిపారు. కౌన్సిలర్లు వార్డు ప్రజలకు ఇచ్చిన హామీలను తాను నెరవేరుస్తానని చెప్పారు. పార్టీలో చేరిన వారు టిడిపి అభ్యున్నతికి, ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరే విధంగా కృషి చేయాలని కోరారు.

కార్మికుల రెగ్యులరైజేషన్‌కు ఆందోళనలు

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

మాట్లాడుతున్న అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల రెగ్యులరైజేషన్‌పై కూటమి ప్రభుత్వం ఆందోళనకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు కోరారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో మున్సిపల్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు, సిఐటియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు వి.గోవిందు, బి.రాముడు మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఏళ్ల తరబడి పని చేస్తున్నా రెగ్యులర్ చేయలేదని తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కూడా హామీ ఇచ్చి తుంగలోకి తొక్కారన్నారు. మున్సిపల్ కార్మికులను, ఇతర కార్మికులను రెగ్యులర్ చేస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాలుగు నెలలు పూర్తయినా మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను చేపట్టలేదని విమర్శించారు. డిమాండ్ల సాధనకు ఈనెల 25 నుంచి దశలవారీ పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక : కమిటీ అధ్యక్షులుగా బి.కేశన్న, ప్రధాన కార్యదర్శిగా కె.ఇస్మాయిల్, ఉపాధ్యక్షులుగా కె.సాల్మన్, బి.మునీంద్ర, బి.రంగస్వామి, సహాయ కార్యదర్శులుగా జై నాగరాజు, కె.ఖాజా, ఎం.తిక్కయ్య, విక్రమ్, మరో 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బిల్లులపై స్పందిస్తారా..?

- భవన నిర్మాణాలకు మోక్షం లభించేనా..?
- కాంట్రాక్టుదారుల ఎదురుచూపులు

ప్రజాశక్తి - చిప్పగిరి

గత టిడిపి ప్రభుత్వ హయాంలో 2017-18లో అంగన్వాడీ భవన నిర్మాణాలకు భూమి పూజ చేశారు. 2019 ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి రావడంతో భవన నిర్మాణాలు ఆగిపోయాయి. అప్పులు తెచ్చి నిర్మాణాలు చేపట్టామని, ఇప్పటికీ వడ్డీలు చెల్లిస్తున్నామని కాంట్రాక్టు దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ టిడిపి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పెండింగ్ బిల్లులు వస్తాయని కాంట్రాక్టుదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

గత టిడిపి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో చిప్పగిరి మండలంలో 2017-18లో అంగన్వాడీ భవన నిర్మాణాలకు ఎంపిక చేశారు. ఎంపిపి పాముల పద్మావతి ఆధ్వర్యంలో నేమకల్లు, సంగాల, తిమ్మాపురం, బంటనహాళ్, నంచర్ల గ్రామాల్లో భవనాల నిర్మాణానికి రూ.8 లక్షల చొప్పున మంజూరు చేసింది. అంగన్వాడీ భవన నిర్మాణాలు చేపట్టేందుకు కాంట్రాక్టు దారులు ముందుకు రాగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు భూమిపూజ చేశారు. అంగన్వాడీ నిర్మాణ పనులను సంబంధిత కాంట్రాక్టుదారులు శరవేగంగా చేపట్టారు. అనుకున్న ప్రకారం బిల్లులు అందకపోవడంతో కొద్దిగా ఆలస్యమయ్యాయి. దాదాపు 70, 80 శాతం పనులను పూర్తి చేశారు. 2019లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లోకి రావడంతో బిల్లులు రాక అక్కడితోనే ఆగిపోయాయి. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చి జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. ఆ భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలన్న ఆలోచన కానీ, సంబంధిత కాంట్రాక్టు దారులకు బిల్లులు అందించాలని ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలన్న ఆలోచన కానీ ఉన్నతాధికారులు చేయలేదు. ఐదేళ్లలో ఏనాడూ వాటి వివరాలను ప్రస్తావించకపోవడం శోచనీయమని కాంట్రాక్టుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ 2024 ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులు విడుదల చేస్తే ఆగిపోయిన నిర్మాణాలను పూర్తి చేసి ఐసిడిఎస్‌కు అప్పజెబుతామని సంబంధిత కాంట్రాక్టు దారులు ప్రభుత్వానికి, ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారు.

నేమకల్లులో ఆగిపోయిన అంగన్వాడీ భవన నిర్మాణం

పెండింగ్ బిల్లులు అందజేస్తే పూర్తి చేస్తాం

- కాంట్రాక్టుదారుడు భాస్కర్, సంగాల అంగన్వాడీ భవనం

2017-18లో అంగన్వాడీ భవన నిర్మాణం చేపట్టాం. మొత్తం భవన నిర్మాణ విలువ రూ.8 లక్షలు ఉన్నప్పటికీ కేవలం ఇప్పటివరకు మాకు రూ.2.50 లక్షలు మాత్రమే మంజూరు చేసింది. దాదాపు 90 శాతం నిర్మాణం పూర్తి చేశాం. ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లిస్తే పూర్తి చేసి భవనాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తాం.

శిథిలావస్థలో ఉన్న ట్యాంకు

శిథిలావస్థలో మంచినీటి ట్యాంకు

- భయాందోళనలో గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని అరికెర గ్రామం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో మంచినీటి ట్యాంకు శిథిలావస్థకు చేరింది. కూలడానికి సిద్ధంగా ఉందని విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. పాఠశాల ప్రారంభమైనప్పటి ఓహెచ్‌ఎస్‌ఆర్ మంచినీటి ట్యాంకు సుమారు 30 ఏళ్లయింది. ట్యాంకును నాసిరకంగా నిర్మించడంతో పిల్లర్స్ పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. 650 మంది విద్యార్థులున్న పాఠశాలలో రెండు బోర్లు ఉన్నాయి. బోరు నీటితోనే వంటావార్పు చేయడం, మరో బోరు విద్యార్థుల స్నానాలకు సరిపోతుంది. ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుకు పూర్తిగా నిండితే పిల్లర్లలో కదలికలు వస్తున్నాయని విద్యార్థులు తెలుపుతున్నారు. ప్రస్తుతం పాఠశాల ఆవరణలో తాగునీటికి మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నా మెయింటనెన్స్ ఇబ్బందులు ఏర్పడినప్పుడు బోరు నీరే గతి. పాఠశాల ఆవరణలో మంచినీటి పైపులైన్ నుంచి పది గ్రామాలకు తాగునీరు అందిస్తున్న అధికారులు విద్యార్థులకు మాత్రం బోరు నీరు అందిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోయారు. పాఠశాల ఆవరణలో ఉన్న పైపు లైన్ నుంచి పాఠశాలకు తాగునీటికి ప్రత్యేక పైపు లైన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కూలడానికి సిద్ధంగా ఉన్న ట్యాంకును, పాత భవనాలను కూల్చి అండర్ గ్రౌండ్ సంపు ట్యాంకు నిర్మించాలని, జిల్లా ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని పేరెంట్స్ కమిటీ సభ్యులు కోరారు.

12 మంది జూదరులు అరెస్టు

- రూ.1,68,750, 4 కార్లు, 4 బైక్‌లు స్వాధీనం

- డీఎస్పీ వెంకట్రామయ్య

మాట్లాడుతున్న డీఎస్పీ

ప్రజాశక్తి - ఆలూరు

మండలంలోని అరికెర గ్రామ పొలంలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసినట్లు పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ కేసు విచారణలో భాగంగా ఆలూరుకు వచ్చారు. అరికెర గ్రామ పొలంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ సి.వెంకట నరసింహులు, సిబ్బందితో దాడి చేసి, జూదరులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1,68,750, 4 కార్లు, 4 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

వైసిపి పాలనలో పేరుకుపోయిన సమస్యలు

- ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - నందవరం

గత వైసిపి ప్రభుత్వంలో సమస్యలు పేరుకుపోయాయని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం నందవరం గ్రామంలో 'ప్రజాదర్బార్' నిర్వహించారు. మండల ప్రజలు భారీ ఎత్తున పాల్గొని తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. 'ప్రజాదర్బార్'కు 330 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. వైసిపి పాలనలో సమస్యలు పేరుకుపోయి మండలం సమస్యల వలయంగా మారిందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేక పోయిందని మండిపడ్డారు. వైసిపి ప్రభుత్వం నిర్వహించిన రీసర్వే వల్ల భూసమస్యలు నెలకొన్నాయని విమర్శించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే 'ప్రజాదర్బార్'ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'ప్రజాదర్బార్'కు ఎక్కువగా భూసమస్యలు, రోడ్లు, పింఛన్లు, తాగునీటి సమస్యపై వినతులు వచ్చాయని చెప్పారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్, మాధవరావు దేశాయ్, మాచాపురం ఖాసీంవలీ, ధర్మపురం గోపాల్, చిన్నరాముడు, మైనార్టీ నాయకులు ఈసా, బ్రహ్మానందరెడ్డి, వెంకటరామరెడ్డి, నాగలదిన్నె ఉరుకుందు, పెద్దకొత్తిలి ఆదిశేషు, కైరవాడి వీరేష్, మిట్టాసోమాపురం వీరేష్, కనకవీడు డబ్బా ఈరన్న పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బీవీ

సబ్సిడీ రుణాలివ్వాలి

- గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం మండల అధ్యక్షులు అమానుల్లా

ప్రజాశక్తి - హొళగుంద

ఎంపీ నాగరాజును, శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

నియోజకవర్గంలో గొర్రెలు, మేకల పెంపకందారుల పరిస్థితి అధ్వానంగా ఉందని, వారికి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని సహాయం చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘం మండల అధ్యక్షుడు ఎం.అమానుల్లా కర్నూల ఎంపీ నాగరాజును కోరారు. మంగళవారం గొర్రెల పెంపకందారుల సహకారం సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లా ఛైర్మన్ కురువ శ్రీనివాస్ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డిని సన్మానించారు. అనంతరం అమానుల్లా మాట్లాడారు. గ్రామంలో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కటాయించి వాటిలో పశుగ్రాసం వేసుకునే విధంగా సహాయం చేయాలని ఎంపీని కోరారు. ఎంపీ సానుకూలంగా స్పందించారు. పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంబాబు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం మాజీ ఛైర్మన్లు నాగేశ్వర రావు యాదవ్, రాంపుల్లయ్య యాదవ్ పాల్గొన్నారు.

భూసర్వే సమస్యల పరిష్కారానికే గ్రామసభ

- తహశీల్దార్ ఇజాద్ అహ్మద్

ప్రజాశక్తి - చిప్పగిరి

భూసర్వేలో నష్టపోయిన రైతుల సమస్యలు పరిష్కరించేందుకే గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, మండల సర్వేయర్ నారాయణ తెలిపారు. మంగళవారం డేగలపాడు గ్రామంలో సర్పంచి నీలకంఠ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి నరసింహులు, రెవెన్యూ కార్యదర్శి అంజి, విలేజ్ సర్వేయర్ అశ్విని ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. భూ సర్వే వల్ల తమకు తక్కువ విస్తీర్ణం వచ్చిందని కొంతమంది రైతుల నుంచి అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. వాటిని పూర్తిగా పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టి, పనితీరును అడిగి తెలుసుకున్నారు. హనుమా నాయక్, అంగన్వాడీ టీచర్ భారతి పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలం పరమాన్‌దొడ్డి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ గురురాజ రావు మాట్లాడారు. ఇప్పటికే భూ రీసర్వేపై నిర్ణయించిన తేదీల్లో గ్రామ సభల ద్వారా వినతులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. రైతుల నుంచి భూసంబంధిత సమస్యలపై 33 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఆర్ఐ ఆదాం, మండల సర్వేయర్ అశోక్, విఆర్ఓ ఆనందం పాల్గొన్నారు. **హొళగుంద** మండలంలోని వన్నూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరయి మాట్లాడారు. భూ రీసర్వేలో జరిగిన తప్పులను వినతి రూపంలో తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తహశీల్దార్ సతీష్, డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ ముకుందరావు పాల్గొన్నారు. **గోనెగండ్ల** మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో తహశీల్దార్ కుమారస్వామి, డిప్యూటీ తహశీల్దార్ విష్ణు ప్రసాద్, రీసర్వే డిటి శిరీష ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తుల నుంచి 65 వినతులు వచ్చాయని, వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తహశీల్దార్ తెలిపారు.

చిప్పగిరి : డేగలపాడులో మాట్లాడుతున్న తహశీల్దార్

మంత్రాలయంలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

గోనెగండ్లలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

బాలునిపై లైంగిక దాడికి యత్నం

- కేసు నమోదు - డీఎస్పీ ఉపేంద్రబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణానికి చెందిన యువకుడు గోపాల కృష్ణ ఉరుకుందు ఒక బాలునిపై లైంగిక దాడికి ప్రయత్నించినట్లు, అతనిపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ ఉపేంద్ర బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఎమ్మిగనూరు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని పట్టణానికి చెందిన యువకుడు గొల్ల కృష్ణ ఉరుకుందు బాలుని పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పిఒసిఎస్ఒ యాక్టు కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గొల్ల కృష్ణ ఉరుకుందును అరెస్టు చేసి, ఆదోని సబ్ జైల్‌కు రిమాండ్ నిమిత్తం తరలించినట్లు చెప్పారు.

నేడు పత్తి క్రయ, విక్రయాలు బంద్

- మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం పత్తి క్రయ, విక్రయాలు జరగవని మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. సోమవారం 12వేలు, మంగళవారం 10 వేల క్వింటాళ్ల పత్తి రావడంతో తూకాలు వేసి సరుకు తరలింపు ఆలస్యం కావడంతో మార్కెట్ యార్డులో పత్తి దిగుబడులు నిలిచిపోయాయని తెలిపారు. కమీషన్ ఏజెంట్ల విన్నపం మేరకు సరుకు తరలింపునకు సమయం పడుతుండడంతో బుధవారం పత్తి మార్కెట్‌కు మాత్రమే సెలవు ప్రకటించినట్లు చెప్పారు. ఇతర పంట దిగుబడుల వ్యాపారాలు యథావిధిగా కొనసాగుతాయన్నారు. పత్తి రైతులు గమనించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల ఎంపిడిఒ కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఉదయం 11 గంటల నుంచి ఎంపిపి టి.నసురుద్దీన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మణిమంజరి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడారు. జడ్‌పిటిసి, కోఆప్షన్ సభ్యులు, అన్ని గ్రామాల సర్పంచులూ, ఎంపిటిసిలు సమావేశానికి హాజరుకావాలని కోరారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరై ఈనెల 22 నాటికి వారి శాఖల కార్యక్రమాలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సమర్పించాలని తెలిపారు.

మహిళా పోలీసుకు సన్మానం

ప్రజాశక్తి - హొళగుంద

మండలంలోని ఎల్లార్తి గ్రామ సచివాలయంలో మహిళా పోలీసుగా పనిచేస్తున్న ధన లక్ష్మీ నంద్యాల జిల్లా అంబాపురం గ్రామ సచివాలయానికి బదిలీ కావడంతో సర్పంచి కురువ చాముండేశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. యువ నేత ఎస్‌కె.గిరి, ప్రధానోపాధ్యాయులు విజయమ్మ మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమని, ఎక్కడ పనిచేసినా ప్రజలకు సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని తెలిపారు. ఉపాధ్యాయులు వెంకటేష్, సచివాలయ సిబ్బంది కుషా నాయక్, శివ, శీను, ఎంఎల్‌హెచ్‌పి నీరజ, ఇందిరమ్మ, లేపాక్షి పాల్గొన్నారు.

ఎపి మద్యం వద్దు.. కర్ణాటక 'టెట్రా'నే ముద్దు...

- **జోరందుకున్న కర్ణాటక మద్యం రవాణా**

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ద్వారా ప్రయివేట్ వ్యాపారులకు మద్యం దుకాణాలు కేటాయించింది. అధికార పార్టీ వారే అన్నిచోట్లా సిండికేట్‌గా మారి ఇష్టానుసారంగా ధరలు పెంచి మద్యం విక్రయిస్తున్నారు. నాణ్యమైన మద్యం క్వార్టర్ రూ.99కే ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పిన మాటలు నీటి మూటలయ్యాయి. నాణ్యమైన మద్యం మాట దేవుడెరుగు... పాత మద్యమే ఇప్పటికీ అందుబాటులో ఉంది. నాణ్యమైన మద్యం తక్కువ ధరకే దొరుకుతున్న కర్ణాటక సరిహద్దుల్లోని పెద్దహరిహణం, సంతేకుడ్లూరు, చిన్నహరిహణం, హనవాల్ గ్రామాల్లో టెట్రా ప్యాకెట్లకు మందుబాబులు క్యూ కడుతున్నారు.

జోరందుకున్న కర్ణాటక టెట్రా మద్యం రవాణా

గత ప్రభుత్వంలో కర్ణాటక మద్యం అక్రమ రవాణాకు ఎస్ఇబి, ఎక్సైజ్, స్పెషల్ స్క్వాడ్, సెబ్ బోర్డర్ స్క్వాడ్‌తో పాటు సంబంధిత మండలాల పోలీసులు కళ్లెం వేశారు. ఇప్పుడు సెబ్ మళ్లీ ఎక్సైజ్‌గా మారింది. వీరు కొత్త మద్యం దుకాణాల ఏర్పాటులో నిమగ్నమై ఉన్నారు. ఇదే అదనుగా భావించి కర్ణాటక మద్యం అక్రమ రవాణాను గతంలో కంటే ఎక్కువగా చేపడుతున్నారు. ఇక్కడి మద్యం సిండికేట్ గ్రామాల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేసి కర్ణాటక మద్యానికి అడ్డుకట్ట వేయాలని చూస్తోంది. కొత్తగా ఇక్కడ షాపులు దక్కించుకుని బాగా సంపాదించుకోవచ్చని భావించిన వారికి కర్ణాటక టెట్రా దెబ్బ తప్పేలా లేదు.

ఎంతైనా అమ్ముకోండి.. మామూలు ఇచ్చుకోండి...

రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన మద్యం అందిస్తామని, క్వార్టర్ రూ.99కే అందిస్తామని చెబుతూ ప్రయివేట్ మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. అందుకు విరుద్ధంగా కర్ణాటక టెట్రా ప్యాకెట్ల వ్యాపారం జోరందుకుంది. కొందరు ఎక్సైజ్, పోలీసు శాఖాధికారులు చూసీచూడనట్లుగా 'ఎంతైనా అమ్ముకోండి.. మామూలు ఇచ్చుకోండి...' అనే నినాదంతో ముందుకు పోతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గ్రామాల్లో బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారని సమాచారం. ఒక్కో బెల్టు షాపు నిర్వాహకుని నుంచి నెలకు రూ.3 వేల నుంచి రూ.8 వేల దాకా వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు స్పందించి బెల్టుషాపులను నివారించాల్సిన అవసరం ఉంది.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కార్యదర్శులతో ఎంపిడిఒ సమీక్ష

ప్రజాశక్తి - కౌతాళం

ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఎంపిడిఒ సుబ్బరాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్, పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రె సెల్ సిస్టం, సమాచార హక్కు చట్టం-2005కు సంబంధించి వివరణలు, ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ, డస్ట్ బిన్‌ల పంపిణీపై సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు హుస్సేనమ్మ, శివప్ప, వెంకటేశులు, అబ్దుల్ కరీం, శ్రీరాములు, ఆంజనేయులు, అబ్దుల్ వహీద్, గౌస్, హనుమంతు, మంజునాథ్, హరికుమార్, కంప్యూటర్ ఆపరేటర్ సలీం బాష పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో డిప్యూటీ కమిషనర్ తనిఖీలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దుకాణాల్లో మంగళవారం జిల్లా డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడారు. దుకాణాల యాజమాన్యం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని 15 మద్యం దుకాణాలను డిప్ ద్వారా దక్కించుకున్న వారు మద్యం దుకాణాలు ప్రారంభించారని తెలిపారు. 15 దుకాణాల్లో ఎలాంటి ఇబ్బందులూ లేవని, కర్నూలు డిపో ద్వారా మద్యం స్టాక్‌ను అందించామని చెప్పారు. దుకాణదారులు బెల్టు షాపులను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్సైజ్ సిఐ రమేష్ రెడ్డి, ఎక్సైజ్ ఎస్ఐ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

అంతర్ మత సమ్మేళనానికి పీఠాధిపతులకు ఆహ్వానం

ప్రజాశక్తి - మంత్రాలయం

కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో జరగనున్న అంతర్ మత సమ్మేళనానికి శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులను ఆహ్వానించారు. మంగళవారం శ్రీమఠం చేరుకున్న బళ్లారి బిషప్ హెన్రీ డిసౌజా, ఫాదర్ ఇవాన్ పింటో మంత్రాలయాన్ని సందర్శించారు. నవంబర్ 27న బళ్లారిలో జరగనున్న అంతర్ మత సమ్మేళనానికి ముఖ్య అతిథిగా ఆహ్వానించడానికి వచ్చినట్లు తెలిపారు. పీఠాధిపతులు శ్రీరాఘవేంద్ర స్వామి చరిత్రను, ప్రాముఖ్యతను ఆయనకు వివరించారు. గతంలో మంత్రాలయం సందర్శించిన సందర్భంగా సర్ థామస్ మన్రోకు రాఘవేంద్రస్వామి బృందావనం నుంచి కనిపించి ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ గురించి తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- దేవనకొండ

సస్య రక్షణ చర్యలతో మిరప పంటలో అధిక దిగుబడులు పొందవచ్చని ఎఒ సురేష్ బాబు తెలిపారు. మంగళవారం మండలంలోని నేలతలమర్రి, నల్ల చెలిమిల గ్రామాల్లో ఎఒ సురేష్ బాబు ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఏరువాక కేంద్రం నుంచి ఎడిఎ గిరీష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మిరప పంటలో ఎకరాకు 10 చొప్పున జిగురు అట్టలు పెట్టుకోవడం వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతిని నివారించవచ్చని తెలిపారు. డిఆర్‌సి నుంచి ఎడిఎ గిరీష్, ఏరువాక కేంద్రం నుంచి శాస్త్రవేత్త రవి, ఎంపిటిసి విజయభాస్కర్ గౌడ్, మాజీ సర్పంచి నాగరాజు, ఎఇఒ వి.రంగన్న, విఎఎ సురేంద్ర, ఎంపిఇఒ వినయ్ పాల్గొన్నారు. **కౌతాళం** మండలం ఉరుకుంద, చిరుతపల్లి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఎఒ శేషాద్రి మాట్లాడుతూ... అధిక వర్షాల వల్ల పంటలకు కలిగే నష్టాలు, వాటిని అధిగమించడానికి కావాల్సిన సూచనలు రైతులకు వివరించారు. చిరుతపల్లి గ్రామంలో రైతు మహేంద్ర రెడ్డి పొలంలో డ్రోన్ టెక్నాలజీ ద్వారా పురుగుమందులను ఎలా స్ప్రే చేసుకోవాలి, వాటి ఉపయోగాలు రైతులకు వివరించారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టుకు విద్యార్థిని

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 25 నుంచి సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగే ఎస్‌జిఎఫ్ అండర్-14 రాష్ట్ర బాలికల ఫుట్‌బాల్ జట్టుకు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని లాస్య ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున తెలిపారు. మంగళవారం రాష్ట్ర ఫుట్ బాల్, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. తమ విద్యార్థులు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని తెలిపారు. ఫుట్‌బాల్ జట్టుకు లాస్య, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో గర్జప్ప, రాంచరణ్ పాల్గొంటారని చెప్పారు. ఫిజికల్ డైరెక్టర్లు నరసయ్య, ముజాహిద్ హుస్సేన్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు కావాలంటూ నిరసన

ప్రజాశక్తి - ఆదోని

ఆన్‌లైన్‌లో గ్యాస్ సిలిండర్ కోసం బుక్ చేసుకున్నా ఇవ్వకుండా ఇండేన్ గ్యాస్ సోమేశ్వర ఏజెన్సీ నిర్వాహకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని లబ్ధిదారులు ఏసోబు, ఈరన్న వాపోయారు. మంగళవారం గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్యాస్ సిలిండర్ కోసం నెల రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నిర్వాహకులు సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. సిలిండర్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఎప్పుడు ఫోన్ చేసినా 'స్టాక్ లేదని' నిర్లక్ష్యంగా సమాధానం చెబుతూ దబాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను తెలుపుదామంటే ఏజెన్సీ కార్యాలయం సక్రమంగా తెరవకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి : డీఎస్పీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ ఉపేంద్ర బాబు

వ్యసనాలకు దూరంగా ఉండి, కుటుంబాలతో సంతోషంగా ఉండాలని ఎమ్మిగనూరు డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు తెలిపారు. మంగళవారం ఎస్పీ ఉత్తర్వుల మేరకు డీఎస్పీ ఉపేంద్ర బాబు, నలుగురు సిఐలు, నలుగురు ఎస్ఐలు, 38 మంది సిబ్బందితో కలిసి పట్టణంలోని అబ్బాస్ టాకీస్ ఏరియాలో గల శాంతి నగర్ కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నాటుసారా, ఎన్‌డిపిఎల్ (కర్ణాటక లిక్కర్, తెలంగాణ లిక్కర్), గంజాయి, మత్తు పదార్థాల కోసం అనుమానిత వ్యక్తుల ఇళ్లలో, అనుమానాస్పద వస్తువులు, వాహనాల మీద సోదాలు నిర్వహించారు. కాలనీలో ఉన్న రౌడీ షీటర్ల కదలికలు, వారు ప్రస్తుతం చేస్తున్న పనుల వివరాల గురించి వాకబు చేశారు. డీఎస్పీ ఉపేంద్ర బాబు మాట్లాడుతూ... అక్రమ, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని, పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలని సూచించారు.

ఈరన్న స్వామి హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - కౌతాళం

హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీలో రూ.1,08,37,696, అన్న దానం హుండీ ఆదాయం రూ.61,422 వచ్చినట్లు దేవాలయ డిప్యూటీ కమిషనర్ జయరాజు తెలిపారు. మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టినట్లు చెప్పారు. నగదుతో పాటు బంగారం 61 గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 14 కిలోల 70 గ్రాములు సమర్పించారన్నారు. దేవస్థానం డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మేడిపల్లి విజయరాజు, హుండీ పర్యవేక్షణ అధికారి ఎస్.వెంకటేష్, ఇన్‌స్పెక్టర్ ఆదోని, దేవస్థాన పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్ పాల్గొన్నారు.

NAME CHANGE

I, BUNDI SAMEENA BEGUM (Old Name) R/o.H.No:23/580/1, Karvanpet, Adoni, kurnool dist, AP., have changed my name as BANDI SAMEENA BEGUM (New Name) W/o. Late.BANDI JAVEED BASHA